www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 మార్చి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఎంఎల్‌సి పోలింగ్ ప్రశాంతం..!

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగాయి. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌కు హాజరయ్యారు. క్యూల్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సికి సంబంధించి 63.82 శాతం ఓట్లు పోలయ్యాయి. టీచర్స్ నియోజకవర్గానికి సంబంధించి 88.36 శాతం పోలింగ్ జరిగింది. హోరా హోరీగా పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య పోటీ జరిగినట్లు కనిపించింది. ఎఎస్‌పేటలో దొంగ ఓటు కలకలం సృష్టించాయి. పిడిఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. కావలి పట్టణంలో టిడిపి, వైసిపి నేతల మధ్య తోపులాట జరిగింది. నెల్లూరు నగరంలో టిడిపి, పోలీసుల మధ్య వివాదం చోటు చేసుకుంది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను చిత్తూరుకు తరలించారు.

- ◆గ్రాడ్యుయేట్ 63.82 శాతం
- ◆టీచర్స్ 88.36 శాతం పోలింగ్
- ◆కావలిలో టిడిపి, వైసిపి నేతల మధ్య గొడవ
- ◆అనంతసాగరంలో దొంగ ఓట్ల కలకలం

పొదలకూరులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

గ్రాడ్యుయేట్ పోలింగ్ వివరాలు

వస	డివిజన్	మొత్తం	పోలైన ఓట్లు	శాతం
1.	కందుకూరు	14505	10.457	72
2.	కావలి	21388	14329	67
3.	ఆత్మకూరు	12773	8189	64.11
4.	నెల్లూరు	58966	35378	60
మొత్తం		107632	68695	63.82

టీచర్స్ ఎంఎల్‌సి ఓటింగ్ వివరాలు

వస	డివిజన్	మొత్తం	పోలైన ఓట్లు	శాతం
1.	కందుకూరు	700	673	96.14
2.	కావలి	1489	1353	90.87
3.	ఆత్మకూరు	926	877	94.71
4.	నెల్లూరు	5050	4312	85.39
మొత్తం		8165	7215	88.36

నెల్లూరులో ఓటు హక్కు వినియోగించుకున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి పి బాబురెడ్డి

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు

ప్రకాశం జిల్లా, కనిగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎంఎల్‌సి పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సాధారణ ఎన్నికలను తలపించాయి. పిడిఎఫ్, వైసిపి, టిడిపి నువ్వా, నేనా అన్నట్లు ప్రచారం నిర్వహించాయి. అదే స్థాయిలో ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఓటర్లు ప్రశాంతంగా క్యూల్లో నిలబడి ఓపిగ్గా ఓటు వేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా భావిస్తున్నారు. అనంతసాగరంలో వైసిపి నేతలు దొంగ ఓట్లు వేయడానికి సిద్ధపడడంతో పిడిఎఫ్ నేతలు అడ్డుకున్నారు. కొద్ది సేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కావలిలో పోలింగ్ పూర్తయిన తరువాత టిడిపి, వైసిపి నేతలు బూత్‌వద్దకు చేరారు. నినాదాలు చేసుకోవడంతో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడం వెనక్కి తగ్గారు. పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి ప్రకాశం జిల్లా కనిగిరిలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్ అభ్యర్థి పి.బాబురెడ్డి నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్లో ఓటు వేశారు. వైసిపి టీచర్ అభ్యర్థి పి. చంద్రశేఖర్‌రెడ్డి నగరంలో ఓటు వేశారు. కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు డికె కళాశాలలో ఉదయం అందరిలా క్యూలో నిలబడి తమ ఓటు వేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరులో ఓటు వేశారు. మాజీ మంత్రి పి. అనిల్‌కుమార్ యాదవ్ కెవిఆర్ పాఠశాలలో ఓటు వేశారు. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డి సంతపేటలోని గుప్తాపార్క్‌లో తన కుమార్తెతో వచ్చి ఓటు వేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, డాక్టర్ జెడ్.శివ ప్రసాద్ రామూర్తినగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఓటు వేశారు. ఈ సమయంలో సిఐ రామ్‌నాయక్‌కు వారికి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. సోమవారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు పరిశీలించారు.. జిల్లాలోని 169 పోలింగ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుతో పాటు వేసవికాలం దష్ట్యా ఓటర్లకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. అన్నీ గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీతో పాటు అన్నీ ప్రసార మాధ్యమాల ద్వారా ఎంఎల్‌సి ఎన్నికల ఓటు హక్కు విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్స్‌లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం తో పాటు లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు 4 డివిజన్స్ కు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సా యంత్రం 4 గంటలు పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సు లను 4 డివిజన్స్‌లోని రిసెప్షన్ కేంద్రాల నుంచి నేరుగా చిత్తూరు రిటర్నింగ్ అధికారికి అందచేయడానికి తీసుకెళ్లారు. ఎస్‌పి విజయారావు పోలింగ్ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. త్రిముఖ పోటీ నెలకున్నట్లు కనిపిం చింది. ఈనెల 16న చిత్తూరులో ఓట్లు లెక్కింపు జరగనుంది. అందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ ప్రశాంతం..!

కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని డికె డబ్ల్యూ కళాశాలలో పోలింగ్ స్టేషన్ ను కలెక్టర్ పరిశీలించి ఏర్పాట్లపై ఓటర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ లలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన పోలింగ్ లో పట్టభద్రులకు సంబంధించి 63.82 శాతం, టీచర్లకు సంబం ధించి 88.36 శాతం పోలింగ్ నమోదైనట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పిఒలు, ఎపిఒలు, మైక్రో అబ్జర్వర్లు, వెబ్ క్యాస్టర్లు, వీడియో గ్రాఫర్లు సుమారు 1750 మంది ఎన్నికల విధుల్లో పాల్గొని, పోలింగ్ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేశారని పోలింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభి నందించారు. తొలుత కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలో పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం డి కే డబ్ల్యూ కళాశాలలో కలెక్టర్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం నెల్లూరు డికె డబ్ల్యూ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ సామాగ్రి స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రిని జాగ్రత్తగా స్వాధీనం చేసుకుని గట్టి బందోబస్తు నడుమ చిత్తూరు లోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆర్డిఒ మలోల, తహశీల్దార్ పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

6న జలదీక్ష చేస్తా..

-అసెంబ్లీలో వాణి వినిపిస్తా -ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పరిష్కారం కాని సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి జరిగే అసెంబ్లీలో గళం విప్పుతానని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు వచ్చిన పోతిరెడ్డిపాడు వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారని, కలుజు వద్ద నిర్మాణం చేస్తామని ప్రకించినా ఇప్పటి వరకు ఏమీ కాలేదన్నారు. ఈ వంతెన సాధన కోసం గాంధీ గిరి పద్ధతుల్లో ఏప్రిల్ 6న ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు జలదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరూ రాకుండా తానొక్కడినే ఈ ఆందోళనలో పాల్గొంటున్నానన్నారు. నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమస్యలను తీసుకొస్తానన్నారు. తనకు అవకాశం రాకపోతే ఎలా తమ నిరసన తెలపాలో అలాగే చేస్తానన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఎంఎల్‌సి ఎన్నికల్లో

ఓటర్లకు అధికార పార్టీ అక్రమాలు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి పి బాబురెడ్డి అరోపణ

ప్రజాశక్తి-నెల్లూరు :ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొనేందుకు గడిచిన మూడు రోజుల నుంచి నగదు విచ్చలవిడిగా పంపిణీ చేస్తు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిందని, అయినా ఓటర్లు పిడిఎఫ్‌ను ఆదరిస్తారనే నమ్మకం పూర్తి స్థాయిలో ఉందని ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పి.బాబురెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్టోన్‌హౌస్ పేట ప్రాంతంలోని ఆర్‌ఎస్‌ఆర్ఎంసి హైస్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్ని కలను పురస్కరించుకొని తాము ప్రచారం చేసే సమయంలో ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆయన సందర్శించామన్నారు. ఆ సమయంలో పలువురు ఉపాధ్యాయులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ ముందుకు తీసుకోచ్చారన్నారు. వైసిపి నాయకులు పాదయాత్ర చేసే సమయంలో ప్రభుత్వం ఉదోగులకు, ఉపాధ్యాయులకు చేసిన హామీలను ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులుగా తామ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల నుంచి మంచి ఆధరణ లభించిందన్నారు. వారందరి సహకారంతో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులు ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధించి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న పి బాబురెడ్డి

చేపల కోసం చెరువు నీరు వృథా

ప్రజాశక్తి -కందుకూరు :చేపలు పట్టుకోవడానికి వీలుగా చెరువు నీరు వదలడంతో పండి ఉన్న పంట పొలాలు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని కొండముడుసు పాలెం చెరువులో నీటిని రైతులకు అవసరమైన మేరకు కాకుండా ఇష్టానుసారం కిందకు వదలడంతో ఇప్పటికే సాగు చేసిన పంటలు తడిసి నష్టపోతున్న పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. నీటిని వదల వద్దని నీటిపారుదల శాఖ అధికారుల దష్టికి తీసుకు పోయినప్పటికీ పట్టించు కోకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. కొండముడిపాలెం చెరువులో చేపలను పెంచారు. ఆ చేపలను పట్టుకోవడానికి చెరువులో నీరు ఉండడంతో వీలు కావడం లేదు. దాంతో చేపలు పెంచిన వ్యక్తి చెరువులో ఉన్న నీటిని కాలువల ద్వారా బయటకు పంపి చేపలు పట్టుకోవాలని ఆలోచనతో ఉన్నారు. దాంతో చెరువులో నీటిని బయటికి వదిలి వధా చేస్తున్నారు. రైతులకు ప్రస్తుతం చెరువు నీరు పెద్దగా అవసరం లేదు. రైతుల అభ్యంతరాలను కూడా చేపల పెంపకం దారుడు లెక్క చేయడం లేదు.


చేపల కోసం చెరువు నీటిని కాలువకు వదిలిన దృశ్యం

పోలింగ్ నిర్వహణపై అప్రమత్తం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పిడిఎఫ్ ఎంఎల్‌సి ఎన్నికల శిబిరాన్ని ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎం. మోహన్ రావు సందర్శించారు. పిడిఎఫ్ శిబిరంలో సిపిఎం ప్రతినిధులు కాల్తిరెడ్డి రవణమ్మ, వేగూరు వెంకయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మారు బోయిన రాజాలతో పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకొన్నారు. అధికార వైసిపి అక్రమాల గురించి అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్డు ముఠా వర్కర్స్, నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ వర్కర్స్, డివైఎఫ్ఐ పాల్గొన్నారు.

మంత్రి 'కాకాణి'కి సన్మానం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి, మండలంలోని కోవెరపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ తలమంచి సురేంద్ర బాబు సోమవారం ఘనంగా సన్మానించారు. మంత్రి కాకానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత కీలకమైన పరిపాలన శాఖ బాధ్యతలు అప్పజెప్పిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సురేంద్ర బాబు మంత్రి గోవర్ధన్ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండపం సర్పంచ్ కాల్తీరెడ్డి సుబ్రహ్మణ్యం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణిని సత్కరిస్తున్న దృశ్యం

బారులు తీరిన ఓటర్లు

జిల్లాలో మండలి ఎన్నికలు ప్రశాంతం

కందుకూరులో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు డివిజన్‌లో శాసనమండలి పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. టీచర్స్ ఓటింగ్ 96.14శాతం పట్టబద్రుల పోలింగ్ శాతం 72.09 నమోదైంది. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కందుకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియో గించుకున్నారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం కందుకూరులో ఓటు వేయడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా డి.ఎస్.పి కండే శ్రీనివాస్ రావు పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు.

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :వలేటివారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఎల్‌సి ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల అభ్యర్థులకు రెండు, ఉపాధ్యాయ ఎంఎల్‌సికి ఒక బూత్‌ను అధికారులు కేటాయించారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 36 ఓట్లు ఉండగా, 35 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 97.2 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టభద్రులు 112వ బూత్‌లో పురుషులు 371, మహిళలు 132 మంది, 71.85 శాతం, 112ఎ బూత్‌లో పురుషులు 429, మహిళలు 131 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.17 శాతం నమోదైంది. మొత్తంగా 1455 ఓట్లుకు 1063 మంది ఓటు వేశారు. 73 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహశీల్దార్ కెవిబిటి సుందరమ్మ తెలిపారు. పోలింగ్ సరళిని నెల్లూరు దిశ డిఎస్పీ ఎన్ సురేష్‌బాబు పర్యవేక్షించారు. గుడ్లూరు సిఐ సుబ్బారావు, ఎస్ఐ సుదర్శన్ వెంట ఉన్నారు. రూట్ అధికారి కుంచాల నరసయ్య, సర్వేయర్ శ్రీలక్ష్మి, విఆర్ఒలు తదితరులు ఉన్నారు. వలేటివారిపాలెం పోలింగ్ బూత్‌లో ఎంఎల్‌సి తూమాటి మాధవరావు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

యువతకు ఆదర్శంగా నిలిచిన వృద్ధుడు

మండలంలోని శాఖవరం గ్రామానికి చెందిన వడ్లమూడి హనుమంతరావు అనే 85 ఏళ్ల వయసు కలిగిన పట్టుభద్రుడు తన ఓటుహక్కును వినియోగించుకున్నాడు. ఆయన మాట్లాడుతూ 1964లో కావలి జవహర్‌భారతి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసినట్లు వివ రించారు. ఓటు వేయడం ఆనందంగా ఉందన్నారు. తన ఓటును వినియోగిం చుకోవడంతో యువతకు ఆదర్శంగా నిలిచారు.

వాకీటాకీతో వ్యక్తి హల్‌చల్

పోలీసుల చేతిలో ఉండాల్సిన వాకీటాకీ ప్రయివేటు వ్యక్తి చేతిలో ఉంది. ఆ వాకీటాకీతో అతను పోలింగ్ బూత్‌ల వద్ద తిరుగుతూ హల్‌చల్ చేసినా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. వివిపాలెం ఎస్ఐ ప్రయివేటు వ్యక్తిని తన కారుకు డ్రైవర్‌గా విధుల్లో ఉంచుకున్నారు. డ్రైవరే ఎస్ఐ అన్నట్లుగా బూత్‌ల వద్ద ఇష్టారాజ్యంగా తిరిగినప్పటికీ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారు. మీడియాకు అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ వారితో ఎస్ఐ వాదనకు దిగారు. ఈ విషయమై కందుకూరు డిఎస్‌పి కండే శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ప్రయివేటు వ్యక్తి అయినప్పటికీ ఎస్ఐ డ్రైవర్ కావడంతో ఆయన వద్ద తమ వస్తువులు ఉండవచ్చునని సెలవిచ్చారు.

రాపూరు : రాపూరు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం పట్టభద్రుల 1749 ఓట్లకు గాను 1147(65.5%), ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ 110 ఓట్లకు గాను 104 (94.5%) పోలయ్యాయి. రాపూరు తహశీల్దార్ వై సుభాషిని పోలింగ్ ను పర్యవేక్షించారు.

ఉలవపాడు : మండలంలో ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా ఉపాధ్యాయ ఓటర్లు 94కి 89 పోల్ అయ్యాయి. గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తం 2111 కాగా 1514 పోలయ్యాయి. పోలింగ్ శాతం 71.5శాతంగా ఉంది. పోలింగ్ నమోదు ప్రక్రియ కొంత నెమ్మదిగా జరగడంతో సాయంత్రం 5 గంటల 20 నిమిషాల వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది. ఆవరణలో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. అనంతరం అధికారుల సమక్షంలో తదుపరి చర్యలు చేపట్టి పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో బ్యాలెట్ బాక్స్‌లో తరలించారు.

ప్రజాశక్తి-గుడ్లూరు :ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎంఎల్‌సి ఎన్నికలు గుడ్లూరులో సోమ వారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు 1748 కాగా 1298 నమోద య్యాయి. దీంతో 74.29శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులు 50 మందికి 50 మంది వేయటంతో 100శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు జిల్లా ఎస్పి విజయరావు, అడిషనల్ ఎస్పీ ప్రసాదు, డీఎస్పీ కండే శ్రీనివాసులు, సిఐ సుబ్బారావు, ఎస్ఐ ప్రసాద్ రెడ్డి ఎన్నికల కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పోలింగ్ కేంద్రంలో దాహం కేకలు

గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రాల దగ్గర ఎలాంటి వసతులు కల్పించకపోగా కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో గ్రాడ్యుయేట్లు ఓటర్లు దాహం కేకలు వేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పలు ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు.

పొదలకూరు : పొదల కూరులో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. పట్టభద్రుల పోలింగ్ 63.17 శాతం, ఉపాధ్యాయుల పోలింగ్ 87 శాతం నమోదైంది. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా... ఎన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నా... తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పట్టణం లోని డిఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం ఆయన పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించ ుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

వెంకటాచలం : మండలంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు 1594 మంది ఓటర్లకు గానూ, 1145 మంది తమ ఓటును 71.8 శాతం వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సికి సంబంధించి 91కి గానూ 83 మంది తమ ఓట్లు వినియోగించుకున్నారు.

తోటపల్లిగూడూరు :మండలంలో సోమవారం ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల మొత్తం సంఖ్య 1216 కాగా, వారిలో 923 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ మేరకు పట్టభద్రుల ఓటింగ్ శాతం 76 కాగా మొత్తం ఉపాధ్యాయుల ఓట్లు 47 అయితే అందులో 45 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కొన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు సంబంధించి 96 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రక్రియను నెల్లూరు రూరల్ డి ఎస్పీ వీరాంజనేయ రెడ్డి, కష్ణపట్నం సీఐ కె. వేమారెడ్డి, తోటపల్లిగూడూరు ఎస్ఐ కె. ఇంద్రసేనా రెడ్డిలు గట్టి పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ తాసిల్దార్ (ఎఫ్ఏసి) శివయ్య, ప్రెసిడింగ్ అధికారిగా ఇందుకూరుపేట డిటి బషీర్ వ్యవహారించారు. ఎంపిడిఒ కన్నం హేమలత పర్యవేక్షించారు.

రాపూరులో...

వలేటివారిపాలెం మండలంలో ఓటువేసేందుకు లైనులో వేచివున్న ఓటర్లు

ఉలవపాడులో...

వెంకటాచలంలో..

పొదలకూరులో...

ప్రశాంతంగా ముగిసిన ఎంఎల్‌సి ఎన్నికలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు 1377మంది ఉండగా 890మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 64.6శాతం ఉపాధ్యాయులు 67మంది ఉండగా 100 శాతం నమోదైంది.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు పాఠశాల నందు సోమవారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. పట్టభద్రుల పోలింగ్ 1501 ఓట్లకుగాను 1137 నమోదై 75.74 శాతం, ఉపాధ్యాయుల పోలింగ్ 68 ఓట్లకు గాను 66 పోలింగ్ అయ్యి 97.06 శాతం నమోదైంది. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరి కోసం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపిడిఓ హేమలత పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఇందుకూరుపేట ఎస్ఐ వాసు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : సోమవారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్‌ను అధికారులు ప్రారంభించారు. స్థానిక తహశీల్దార్ సుబ్రమణ్యం, ఎంపిడిఒ భాస్కర్, సిఐ రవినాయక్, ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ ప్రారంభమైంది. ఉపాధ్యాయుల ఓట్లు 50 మంది తమ ఓటు హక్కు వినియోగించు కోవాల్సి ఉండగా 100 శాతం ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఓట్లు 1170 మంది ఓటు హక్కు వినియోగించాల్సి ఉండగా 61 శాతం మంది అనగా 718 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పోలింగ్ అధికారులు తెలిపారు. ఆత్మకూరు మాజీ ఎంఎల్ఏ కొమ్మి లక్ష్మయ్య నాయుడు, టిడిపి అగ్రికల్చరల్ కార్యదర్శి గుటూరు కన్నబాబు ఎన్నికల సరళిని పరిశీలించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయులు ఉదయం నుంచి పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకువచ్చేందుకు కృషి చేశారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలో ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయులు 89మంది ఉండగా 84మంది ఓటు వేయగా 94.38శాతం, పట్టభద్రులు 1010మందికి గాను 603మంది ఓటు హక్కు వినియోగించుకోగా 60శాతం నమోదైనట్లు పోలింగ్ అధికారులు తెలియజేశారు. పోలింగ్ ప్రక్రియను ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరిశీలించారు. మూడు గంటల నుండి క్యూలైన్లో ఉండి ఇబ్బందులు పడుతున్నామని ఓటర్లు ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. ఓటు వేసేందుకు ఎందుకు ఆలస్యం అవుతుందని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పోలింగ్ ప్రక్రియ కాస్త ఆలస్యం అవుతుందని సిబ్బంది ఆయనకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఎంఎల్ఏ సిబ్బంది కొరతపై ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణ కుమారితో ఫోన్లో మాట్లాడి సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. కనీస తాగునీరు కూడా వసతి లేదని ఓటర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎంఎల్ఏ నీళ్ల మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా టిడిపి నేత కన్నబాబు ఎంఎల్ఏ ఎన్నికల్లో ఆత్మకూరు ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్‌రెడ్డి అసలు ఓటు హక్కును నమోదు చేసుకోలేదని విమర్శ చేయడంతోతన ఓటు హక్కుపై ఎంఎల్ఏ స్పందించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో తాను ఓటు హక్కును నమోదు చేసుకున్నప్పటికీ కొన్ని కారణాలతో నమోదు కాలేదన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహశీల్దార్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు జరుగు ఎంఎల్‌సి బోగోలు మండలంలో పోస్ట్ గ్రాడ్యుయేట్లు మొత్తం 1408 ఉండగా 962 ఓట్లు 68.32 శాతం ఓట్లు, టీచర్స్ మొత్తం46 ఉంటే 42 ఓట్లు 91.3 శాతం పోలయాన్ని తెలిపారు.



ప్రజాశకి-ఉదయగిరి : తూర్పు రాయలసీమ శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా సోమవారం ముగుసాయి. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు ప్రశాంతత వాతావరణంలో 116 మంది ఉపాధ్యాయులు ఉండగా 111 మంది తమ ఓటును వినియోగించుకోగా 98.86 శాతం ఉపాధ్యాయులు పోలింగ్ నమోదు కాగా పట్టభద్రులు మొత్తం 1390 మంది ఉండగా పురుషులు 430 స్త్రీలు 546 మొత్తం 970 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పోలింగ్ 70.21 శాతం పోలింగ్ అయినట్లు తహశీల్దార్ సాన శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తమ కార్యాలయ సిబ్బందితో ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ముందుగా యుటిఎఫ్, వైసిపి, టిడిపి పార్టీలు శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్లకు స్లిప్‌లను అందజేశారు. అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ గిరిబాబు సూచనలతో ఎస్ఐ ఎన్. ప్రభాకర్ తమ సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటుచేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా ముగించారు.

ప్రజాశక్తి-జలదంకి : మండలంలో సోమవారం జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటింగ్ 67.27 శాతం, ఉపాధ్యాయుల ఓటింగ్ నూటికి నూరు శాతం పోలయ్యాయి. పట్టభద్రులు 981 ఓట్లకు 660 పోలయ్యాయి. మహిళలు 156 మంది, పురుషులు 504 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓట్లు 29 ఉండగా 29 మంది ఓట్లు వేశారు. 24 మంది పురుషులు ఐదు మంది మహిళలు ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహశీల్దార్ పద్మావతి పర్యవేక్షణలో ఎన్నికల అధికారి శాంసన్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. శివారెడ్డి డివిజనల్ స్పెషల్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, అడిషనల్ ఎస్‌పి ప్రసాద్‌లు ఎన్నికల పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. పిడిఎఫ్, టిడిపి, బిజెపి, వైసిపి నేతలు పోటాపోటీగా తమ ఓటు బ్యాంకును పోలింగ్ అయ్యేలా చేసుకున్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : విడవలూరులో సోమవారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నికలకు పోలింగ్‌కేంద్రాల్లో 1337 ఓటర్లకు గానూ 996 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 57శాతానికి గానూ 52 శాతం పోలైనట్లు, గ్రాడ్యుయేట్ 74 శాతం ఓట్లు నమోదైనట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

ప్రజాశక్తి-సంగం : జెడ్‌పి హై స్కూల్‌లో పోలింగ్ ప్రక్రియను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకు పట్టభద్రులు ఆకర్షితులై ఓటు రిజిస్ట్రేషన్ భారీగా చేసుకున్నారన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికలలో కలిగిరి నాయకుల పనితీరు బాగుందని ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శాంతకుమారి, జెడ్‌పిటిసి పాలూరు మాల్యాద్రి రెడ్డి, కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, ములక శ్రీనివాసుల రెడ్డి, మాలేపాటి వెంకటసుబ్బయ్య, కోడూరు కృష్ణారెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి, బొల్లినేని సత్యనారాయణ, దేవి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఎన్.జనార్ధన్ రెడ్డి, రియాజ్ రెడ్డి, డి.ఆదిశేషారెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : ఎంఎల్‌సి ఎన్నికల దగదర్తి మండలం 65 శాతం పోలేనట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్, ప్రజా పరిషత్, విద్యాశాఖ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారన్నారు. టీచర్ సంబంధించి మెత్తం 49 ఓట్లు ఉండగా 48 పోలయ్యాయన్నారు. గ్రాడ్యుయేట్‌కు సంబంధించిన మెత్తం 1186 ఓట్లు ఉండగా పురుషులు 625 మహిళలు 218 మంది తమ ఓటును వినియోగించుకున్నారని వారు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న సిఐ, ఎంపిడిఒ

ప్రజాశక్తి-కోవూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికలు కోవూరు నియోజకవర్గంలోని కోవూరు మండలంలో ప్రశాంతంగా జరిగింది. జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో నాలుగు పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు కాగా ఒకటి ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. కోవూరు మండలానికి సంబంధించి పట్టభద్రుల ఓట్లు మొత్తం 3111 కాగా అందులో 2019 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం మొత్తం 65.07శాతం గా నమోదయింది. ఉపాధ్యాయుల ఓట్లు 232 కాగా అందులో 214 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం మొత్తం 92.24శాతంగా పోలింగ్ నమోదైంది. కేంద్రాలను డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి, ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, టిడిపి సీనియర్ నాయకులు పెళ్లకూరు శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. కోవూరులో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు జాగ్రత్త వహించారు దీంతో కోవూరులో పట్టభద్రుల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఓటింగ్ ప్రక్రియ అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకే యువతీ యువకులు ఓట్లు వేయడానికి పోలింగ్ బూత్ల వద్దకు బారులుదీరారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మూడు పట్టభద్రుల కోసం ఒకటి ఉపాధ్యాయ కేంద్రం కోసం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నుడా వైస్ చైర్మన్ టీజీ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. డి.ఎస్.పి కోటారెడ్డి ఆధ్వర్యంలో సి నాగేశ్వరరావు ఎస్ఐలు శివ శంకర్రావు, బి రాజేష్, సాయి ప్రసాద్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5.30 గంటలకు ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. తొలి గంటలోనే ఉపాధ్యాయ పోలింగ్ 66.6 శాతం నమోదు కాగా పట్టభద్రులు పోలింగ్ 5.52 శాతం ఓట్లు పోలింగ్ అయ్యాయి. గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ పోలింగ్ సమయానికి ఉపాధ్యాయులు పోలింగ్ 91.66శాతం నమోదు కాగా, పట్టభద్రులు ఓటింగ్ శాతం 66.71 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఓటింగ్ సరళిని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, కొమ్మి లక్ష్మయ్య నాయుడు టిడిపి నాయకులు గూటూరు మురళి కన్నబాబు, ఓటింగ్ సరళని పరిశీలించారు. ఆత్మకూరు 148, 148 ఎ బూతుల్లో వికలాంగులు తమ ఓటు హక్కులు వినియోగించుకున్నారు కళ్లు కనిపించని కొడుకు పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి తండ్రి తనతోపాటు తన కుమారుడి ఓటు నమోదు చేయించడం ఆసక్తికరంగా మారింది. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-కలిగిరి : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా సోమవారం జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషనులలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రాజు మాట్లాడుతూ మండలంలో 53 ఉపాధ్యాయుల ఓట్లు ఉండగా 53 ఓట్లు నమోదు కావడం జరిగిందన్నారు. పట్టభద్రులకు సంబంధించి 1617 ఓట్లకు గానూ 916 ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సూర్య ప్రకాష్ రెడ్డి సిబ్బంది కలిసి భద్రతా చర్యలు తీసుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు వెల్లడి

ప్రజాశక్తి-అల్లూరు : రాష్ట్రంలో 9 ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు వెల్లడించారు. సోమవారం మండల కేంద్రం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆయన ఓటు హక్కును వినియోగించుకుని పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరుగుతున్న ప్రస్తుత ఎన్నికల్లో 10లక్షల 59వేల మంది ఓటు హక్కును వినియోగించుకుంటున్నా రని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే 5 శాసనమండలీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని అందులో భాగంగా టీచర్లకు-3, పట్టభద్రులకు -2, అలాగే 4 శాసనమండలి ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని వివరించారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాల రాద్ధాంతం తప్ప ఇంకేమీ లేదన్నారు. ఎన్నికలు ఏ విధంగా నిర్వహిస్తారో అంటూ ప్రజల్లో అపోహ కల్పించారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఇటీవల విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మెట్‌లో రూ.13 కోట్ల 68 లక్షలు పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు విచ్చేసి ఎంఒయుపై సంతకాలు చేసి వెళ్లారన్నారు. రాష్ట్రంలో 6 లక్షల 50 వేల మందికి జగన్మోహన్ రెడ్డి అవకాశాలు కల్పిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల కేంద్రంలో ఎఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావు పేట పంచాయితీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కేంద్రాన్ని జిల్లా అడిషనల్ ఎస్‌పి ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. ఆయనతో డి.ఎస్.పి ప్రసాద్, సిఐ రాజేష్, బిట్రగుంట ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులున్నారు.

ఓటు గల్లంతుపై గ్రాడ్యుయేట్ ఆవేదన

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సోమవారం తూర్పు రాయలసీమ ప్రాంతాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానాలకు జరిగిన ఎన్నికల్లో పాదర్తి శంకర్రావు అనే ఓ గ్రాడ్యుయేట్ ఓటు గల్లంతు కావడంతో బాధితుడు ఆవేదన వ్యక్తపరిచారు. ఐడి నెంబర్ ఉన్నా సీరియల్లో 2 సార్లు పేరు నమోదు కావడంతో అధికారులు ఓటు లేకుండా చేశారని విచారం వ్యక్తపరిచారు. 1995 నుండి రెండు దఫాలు ఓటుహక్కు వినియోగించుకున్నారని తెలియజేశారు. గ్రాడ్యుయేట్లపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమాధానం చెప్పే స్థితిలో అధికారులు లేరని సంబంధిత విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.



మాట్లాడుతున్న బాధితుడు శంకర్రావు

దొంగ ఓటర్లను అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో సోమవారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ వారు దొంగఓట్లు వేయడానికి వచ్చిన వారిని మండల పిడిఎఫ్ నాయకులు అన్వర్ బాషా, మంగళ పుల్లయ్య అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార బలంతో వైసిపి నాయకులు దొంగఓట్లు వేసుకొని గెలవాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడమే కాక దొంగ ఓట్లు వేయడానికి వచ్చారన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎంఎల్‌సి ఎన్నికలను సోమవారం కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పరిశీలించేందుకు విచ్చేయగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ బూతుల వద్దకు ఆయన అనుచరులతో కలిసి వెళుతున్న నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని బాహాబాహీకి దిగారు. ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి సమన్వయంతో ఇరువర్గాలను సముదాయించి పంపారు. ఇదిలా ఉండగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని అధికారులు వివరించారు. క్రైమ్ అడిషనల్ ఎస్‌పి ప్రసాద్ విచ్చేసి ఎన్నికల సరళిని పూర్తిస్థాయిలో ఆరా తీశారు. తహశీల్దార్ శ్రీ రామకృష్ణ, ఎంపిడిఒ శ్రీదేవి ఆయా పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. ఉపాధ్యాయులకు సంబంధించి 107 ఓట్లు ఉండగా అందులో 101 పోలయ్యాయని 94.39 శాతం అలాగే పట్టభద్రుల ఓట్లు 18 64 ఉండగా 1338 వేయగా 71.78 శాతం నమోదయ్యాయని తెలియపరిచారు.

ప్రజాశక్తి - కావలి : కావలి డివిజన్‌లో సోమవారం సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి తూర్పురాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఓట్లు 67శాతం, టీచర్స్ నియోజకవర్గంలో 90శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం పట్టభద్రుల ఓటర్లు 21,388 కాగా వారిలో 9,712మంది పురుషులు 4,617మంది స్త్రీల ఓటర్లు ఉన్నారు. 21,388 మందికి గానూ 14,329 ఓట్లు పోలయ్యాయి. డివిజన్‌లోని మొత్తం టీచర్స్ ఓట్లు 1,489 కాగా, 849మంది పురుషులు, 504మంది స్త్రీల ఓట్లు ఉన్నాయి. వాటిలో 1,353 ఓట్లుపోలయ్యాయి. కాగా కావలిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కావలి పట్టణంలోని జిల్లాపరిషత్ హైస్కూలులో కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడి పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్.పి.విజయారావు పరిశీలించారు.

ప్రజాశక్తి-కొండాపురం : సోమవారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఖాజావలి ప్రతిష్టమైన బందోబస్తు నిర్వహించారు. తహశీల్దారు ఆర్ బ్రహ్మయ్య పోలింగ్ ముగిసే వరకు పోలింగ్ కేంద్రం వద్ద ఉండి పర్యవేక్షించారు. మొత్తం పట్టభద్రులకు సంబంధించి 888 ఓట్లు ఉండగా 400 మంది పురుషులు, మహిళ గ్రాడ్యుయేట్లు 118 తమ ఓటు హక్కును, అలాగే 27 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా26 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

355 పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం 439పొగాకు బేళ్లను రైతులు తీసుకురాగా 355 బేళ్లను పలు కంపెనీల వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో 62పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వీటిలో ఎన్ఎస్ 05 ఎన్ బి 53, సిఆర్ 04ఉన్నాయని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ఠ ధర రూ.193, సగటు ధర రూ.195.67 నమోదైందని తెలిపారు. ఈ వేలంలో 6మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

గ్రూప్ సభ్యులకు సూచనలు

ప్రజాశక్తి ఇందుకూరుపేట

మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన జిఆర్‌కె గార్డెన్ నిర్వాహకులు మంజులకు చెందిన గార్డెన్లో నెల్లూరులోని మిద్దె తోటల గ్రూప్ సభ్యులు 55 మందితో సోమవారం 11వ గార్డెన్ మీట్ నిర్వహించి వారికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ మొక్కలకు అంటు కట్టడం, ఎయిర్ లేయింగ్ పద్ధతులు గూర్చి వివరించారు. అనంతరం జిఆర్‌కె గార్డెన్ నిర్వాహకురాలు మంజుల మాట్లాడుతూ తరచు ఇలాంటి మీట్లు నిర్వహించడం ద్వారా మొక్కలు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తమ దగ్గర ఉన్న మొక్కలు విత్తనాలు అందరికీ పంచి, వారి దగ్గర ఉన్న కొత్త రకపు విత్తనాలను మనం తీసుకొని చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ సంరక్షణ జరుగుతుందన్నారు. ఇలా కొత్త కొత్త విత్తనాలు మొక్కలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా కొత్త వారికి కూడా మొక్కలు పెంచాలని ఆసక్తి మొదలవుతుందన్నారు.

పొలం వివాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-జలదంకి

పొలం వివాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం జలదంకి మండలంలోని చోడవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో చెప్పు సరే శ్రీనివాసులు రెడ్డి, నితీష్ రెడ్డి, లక్ష్మిలకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. బాధితుల పొలంలో మల్లి రమేష్ రెడ్డి పొలాన్ని దున్నుతుండగా బాధితులు ముగ్గురు వెళ్లి ఇలా దున్నటమేమిటని ప్రశ్నించారు. రమేష్ రెడ్డి కత్తితో దాడి చేయడంతో ముగ్గురికి కత్తి గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్నారు. జలదంకి ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు విజయం తథ్యం

- ఎంఎల్‌సి ఎన్నికల కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.మోహన్‌రావు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్ని బోగస్ ఓట్లు సృష్టించి కుట్రలు పన్నినా ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్ల రెడ్డి, పోక్కిరెడ్డి బాబుల విజయం తథ్యమని ఎంఎల్‌సి ఎన్నికల కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా కొత్తూరులోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం మాఫియా కుంభకోణంలో ఉన్న వాళ్లని, విద్యను వ్యాపారంగా మార్చి కోట్లకు పడగలేత్తిన వాళ్లని అధికార పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిచారన్నారు. ఈ ఎన్నికలు సాధారణ ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు, పట్టభద్రులకు, కార్పొరేట్ దిగ్గజాలకు మధ్య జరిగిన ఎన్నికగా ఆయన అభివర్ణించారు. అధికార పార్టీ ఎన్ని బోగస్ ఓట్లు చేర్చి ధనాన్ని విపరీతంగా పంచి కుట్రలు చేసి, దొంగ ఓట్లను సృష్టించిన నిరుద్యోగులు, ఉపాధ్యాయులు వీటిని తిప్పి కొట్టి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇక వైసిపికి ఓటమి తప్పదని జోస్యం పలికారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్, ఇందుకూరుపేట సిపిఎం నాయకులు మైపాటి కోటేశ్వరరావు, తిక్కవరపు ప్రభాకర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ శ్యామ్‌రెడ్డి, వేణు, వెంకయ్య, శరత్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఎన్నికల కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.మోహన్‌రావు

ఇందిరమ్మకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - జలదంకి

జలదంకి మండల సచివాలయాల కన్వీనర్, వైసిపి నాయకు రాలు తిప్పా రెడ్డి ఇందిరమ్మను సోమవాం ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి శాంతమ్మ పరామర్శించారు. జలదంకి పోలీస్ స్టేషన్లో బాధితుల పక్షాన మాట్లాడడానికి తిప్పారెడ్డి ఇందిరమ్మ వెళ్లే క్రమంలో పోలీస్ స్టేషన్ ఎదుట కళ్లు తిరిగి, స్పృహ తప్పి పడిపోయారు. కావలిలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొంది జలదంకిలోని ఆమె స్వగృహంలో ఇందిరమ్మ విశ్రాంతి తీసుకుంటున్నారు. ధైర్యంగా ఉండాలంటూ ఇందిరమ్మకు ఎంఎల్ఎ దంపతులు సూచించారు. ఎంఎల్ఎ వెంట జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు పాలవల్లి మాలకొండ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, కేశవరం సర్పంచ్ రావిప్రసాద్ నాయుడు, అన్నవరం సచివాలయం కన్వీనర్ దామెర్ల దేవదాసు, అన్నవరం వైసిపి నాయకులు గుమ్మిడి రమేష్, మండలానికి చెందిన వైసిపి నేతలు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

మండలంలోని అన్ని పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జరుపుకొని, సదరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన ప్రసంగిస్తూ ఇప్పటికే అన్ని పాఠశాలలో విద్యార్థులకు తగ్గట్లుగా నులిపురుగుల మందు పంపిణీ చేయాలని తెలిపారు. కావున అందరూ పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో ఉన్న పాఠశాలలో నోడల్ అధికారిని ఏర్పాటు చేశామన్నారు. కావున వీరి ఆధ్వర్యంలో కార్యక్రమం పూర్తి చేయాలని, అలాగే ఏదైనా అవాంతరం జరిగితే వైద్య అధికారి సలహాలు మేరకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అన్ని రకాల సర్వేలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అందరూ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులు

నేడు 'చలో మచిలీపట్నం'

ప్రజాశక్తి-బిట్రగుంట

జనసేన 10వ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఏర్పాటుచేసిన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని మండల జనసేన అధ్యక్షులు షేక్.నూరుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఇబ్రహీంపేట జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నంలో జరగబోయే జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 14వ తేదీ కావలి నుంచి బస్సును ఏర్పాటు చేస్తున్నామని, పవన్‌కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు అందరూ పాల్గొని ఆవిర్భావసభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గంగపట్ల సురేష్, మహేష్, వేణుగోపాల్, శివశంకర్ పాల్గొన్నారు.

కొండముడుసుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

టెండరు ప్రకటన

తేది: 12-03-2023

కందుకూరు మండలం, కొండముడుసుపాలెం గ్రామ పంచాయతీ నందు 2023-2024 సం॥నకు అనగా తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ క్రింది పోస్టులకు తేది: 17-03-2023 గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఉదయం 10-00 గం॥ల నుండి మధ్యాహ్నం 3-00 గంటల వరకు సీల్డు టెండరు కోరబడుచున్నవి.

వ.నెం.	వివరాలు	పోస్టులు	కాల పరిమితి	ధరావత్తు
1.	PWS స్కీము టర్న్‌కాక్	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-
3.	స్వీపరు	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-

సం/- పంచాయతీ కార్యదర్శి,
కొండముడుసుపాలెం గ్రామ పంచాయతీ, కందుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

టెండరు ప్రకటన

తేది: 12-03-2023

కందుకూరు మండలం, పలుకూరు గ్రామ పంచాయతీ నందు 2023-2024 సం॥నకు అనగా తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ క్రింది పోస్టులకు తేది: 17-03-2023 గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఉదయం 10-00 గం॥ల నుండి మధ్యాహ్నం 3-00 గంటల వరకు సీల్డు టెండరు కోరబడుచున్నవి.

వ.నెం.	వివరాలు	పోస్టులు	కాల పరిమితి	ధరావత్తు
1.	PWS స్కీము టర్న్‌కాక్	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-
2.	ఎలంక్ట్రీషియన్	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-
1.	PWS వాచ్‌మెన్	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-
1.	డ్రైవర్	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-
3.	స్వీపరు	01	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ.200/-

సం/- పంచాయతీ కార్యదర్శి,
పలుకూరు గ్రామ పంచాయతీ, కందుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.